నేడు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అర్జీలను మీ కోసం వెబ్ సైట్ లో కూడ నమోదు చేయవచ్చు - కలెక్టర్ విజయ కృష్ణన్

విశాలాంధ్ర-అనకాపల్లి (కలెక్టరేట్) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని (పి జి ఆర్ ఎస్) నేడు సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ తో పాటు జిల్లాలో అన్ని మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటలకు పి జి ఆర్ ఎస్ కార్యక్రమం నిర్వహించి అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పి జి ఆర్ ఎస్ కు హాజరు కాని అర్జీదారులు Meekosam.ap.gov.in (మీ కోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్సైట్ ద్వారా అర్జీలు నమోదు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పి.జి.ఆర్.ఎస్ లో సమర్పించిన అర్జీల సమాచారం కోసం 1100 టోల్ ఫ్రీ నెంబర్ కు నేరుగా కాల్ చేసి తెలుసుకోవాలని అర్జీదారులకు కలెక్టర్ సూచించారు.



బ్రిటిష్ పాలనను తలపిస్తున్న కూటమి పాలన...

తప్పుడు కేసులు ఆపై అరెస్టులు....

విశాలాంధ్ర-నాతవరం : నేను బ్రిటిష్ పాలన చూడలేదు కానీ, విన్నాను. అదే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న పాలన బ్రిటిష్ పాలనను తలపిస్తుందని సిపిఐ పార్టీ నాతవరం మండల కార్యదర్శి అంకంరెడ్డి చిన్నయ్య నాయుడు అన్నారు. ఆదివారం తన గ్రామంలో మాట్లాడుతూ ప్రజా ఉద్యమ నేత అప్పలరాజును అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్యగా అన్నారు. ఎన్నికల టైం లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు కానీ, ప్రశ్నించిన వారిని మాత్రం అరెస్టు చేయడం ఆనవాయితీగా మారిందని విమర్శించారు. రాజయ్యపేట బల్క్ డ్రగ్ పార్క్ సంబంధించి మత్స్యకారులకు సంఘీభావం పలకడం అప్పలరాజు చేసిన పెద్ద తప్పా అంటూ , దానికి అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. రాష్ట్రంలో మహిళల పట్ల అరాచకాలు చేస్తున్న వారి మీద కేసులు పెట్టాల్సింది పోయి, ఉద్యమ నేతల మీద కేసులు పెట్టడం మంచిది కాదు నీకు ప్రభుత్వ ఒకసారి పునరాలోచించుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసిన గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుందని, దీనిపై ప్రభుత్వం చూసి చూడనట్లుగా ఎందుకు వ్యవహరిస్తుందో ప్రజలకు చెప్పాలని అన్నారు. హెూం మంత్రి అనితను ఎందుకు ఓట్లు వేసి గెలిపించామని నియోజకవర్గ ప్రజలు తలలు కొట్టుకుంటున్నారని అన్నారు. గెలిచిన వెంటనే గంజాయి పై ఉక్కు పాదం అంటూ ప్రగల్భాలు పలికే సుమారు 18 నెలలకే మరిచిపోయావా, ఎక్కడ చూసినా గంజాయి అంటూ విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అప్పలరాజు పైన పెట్టిన కేసులను ఉపసంహరించుకొని విడుదల చేయాలని సిపిఐ పార్టీ నుంచి డిమాండ్ చేస్తున్నామని చిన్నయ్య నాయుడు అన్నారు.

నాగులపల్లి సొసైటీకి జాతీయ సహకార అభివృద్ధి సంస్థ ఉత్తమ ప్రతిభ అవార్డు

విశాలాంధ్ర -మునగపాక: మండలం లోగల నాగులపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి ఆదివారం గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన సహకార ఉత్సవాల్లో జాతీయ సహకార అభివృద్ధి సంస్థ వారు నుండి మునగపాక మండలంలో గల నాగులపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి రైతులకు రుణ పంపిణీ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రతి సంవత్సరం లాభాలను పంపిణీ చేస్తూ రైతు వ్యవసాయ దినుసులు నిల్వచేసుకునే నిమిత్తం సుమారు 500 మెట్రిక్ టన్నుల కెపాసిటీ కలిగిన గోడలు నిర్మాణం చేసి రైతు ఉత్పత్తి కేంద్రం (ఎఫ్.పి.ఓ) ఎంపిక కాబడి అవగాహన సదస్సు నిర్వహిస్తు అన్ని రంగాలలో సభ్య రైతులకుసహకార సేవలకు ఎంపిక కాబడి ఉత్తమ ప్రతిభా అవార్డుతో పాటు 25 వేలు నగదు బహుమానంను ఏపీ రాష్ట్ర సహకార బ్యాంకు చైర్మన్ జి వీరాంజనేయులు ఏపీ రాష్ట్ర సహకార సంఘాల అడిషనల్ రిజిస్టర్ ఆనందబాబు, కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షులు ఎన్.రఘురామ్, ఏపీ రాష్ట్ర సహకార బ్యాంకు ఎండి. ఆర్వి రామకృష్ణారావు ఎన్సీడీసీ రీజనల్ మేనేజర్ గోస్వా చేతుల మీదగా సంఘ చైర్మన్ ఎల్లపు వెంకట భాస్కరరావు సంఘ సీఈవో మళ్ల సోమచంద్ర నాయుడు, సంఘ పర్సనల్ మంత్రం జగదీష్ సదర బహుమానాలు పొందారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్కుమార్ కు సంఘ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

కూచిపూడిలో పాల్గొన్న పాయకరావుపేట కళాకారులు

విశాలాంధ్ర-పాయకరావుపేట : హైదరాబాదులో భారత్ ఆర్ట్స్ అకా డమీ ఆధ్వర్యంలో జరిగిన కూచి పూడి నాట్యం కార్యక్రమంలో 4,608 కళాకారులు పాల్గొనగా అందులో పాయకరావుపేట నుంచి 32 మంది కళాకారులు ఏలూరు దీపిక ఆధ్వర్యంలో అక్కడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో నమోదు చేసుకుంది.

నక్కపల్లి సర్కిల్ పరిధిలో 30 యాక్ట్ అమల్లో ఉంది

సిఐ ఎల్. రామకృష్ణ

విశాలాంధ్ర -యస్.రాయవరం: నర్సీపట్నం సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని నక్కపల్లి రూరల్ సీఐ ఎల్. రామకృష్ణ తెలిపారు ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పోలీసులు అనుమతులు లేకుండా ర్యాలీలు ధర్నాలు చేయరాదని ముఖ్యంగా నక్కపల్లి రూరల్ సర్కిల్ పరిధిలో ఎస్. రాయవరం ,అడ్డరోడ్డు, కోటవురట్ల ప్రాంతాలలో ఎటువంటి ధర్నాలకు నిరసనకు అనుమతులు ఇవ్వలేదని ఎవరైనా అటువంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.

అడ్డరోడ్డు రెవెన్యూ డివిజన్ పై వైసీపీ సీనియర్ నాయకుడు పోలిశెట్టి పెద ఈశ్వరరావు హర్షం

విశాలాంధ్ర-యస్. రాయవరం : మండలంలోని ముఖ్య వ్యాపార కేంద్రమైన అడ్డరోడ్డు లోని రెవెన్యూ డివిజన్ కార్యాల యం ఏర్పాటుపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై వైసిపి సీనియర్ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు .ఆదివారం అడ్డరోడ్డులోని ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. రోజు రోజుకి అభివృద్ధి చెందుతున్న అడ్డరోడ్డుకు ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుచేయాలని వైయస్. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విన్నవించడం జరిగిందని ముఖ్యంగా రెవిన్యూ డివిజన్ ఆర్టీసీ కాంప్లెక్స్, పోలీస్ డివిజన్ కార్యాలయము వంటి ముఖ్యమైనవి ఏర్పాటు చేయాలని ఆశించడం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం లో స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఈ నియోజకవర్గ పై ఉన్న అభిమానం అందులో ఆమె సిఫారసుతో ఎస్. రాయవరం మండలం అడ్డరోడ్డు ప్రాంతంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి నిర్ణయం రావడం ఎంతో అభినందనీయమని అన్నారు. తిమ్మాపురం మాజీ సర్పంచ్ అద్దేపల్లి నూకినాయుడు మాట్లాడుతూ ..తిమ్మాపురం ప్రాంతంలోని రెవిన్యూ డివిజన్ కార్యాలయం రావడం ఎంతో సంతోషకరంగా ఉందని అభివృద్ధి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమా లు విషయంలో మంత్రి తీసుకున్న నిర్ణయాలకు తాము ఎప్పుడు మద్దతుగా ఉంటామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో వైస్ .ఎంపీపీ అప్పన్న సీనియర్ నాయకులు అల్లాడ నాగరాజు ,పినపోలు ప్రసాదు తదితర్లు పాల్గొన్నారు.

ఫలించిన వైసీపీ పోరాటం...

మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవిన్యూ డివిజన్ లోనే కొనసాగింపు

ప్రభుత్వం నిర్ణయం అభినందనీయం: వైసీపీ నేత బొడ్డేడ ప్రసాద్

విశాలాంధ్ర -మునగపాక: వైసీపీ పోరాటం ఫలించింది...మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవిన్యూ డివిజన్ లోనే కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని అనకాపల్లి వైసీపీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయితే అచ్యుతాపురం మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్లోనూ కొనసాగిస్తే చాలా మంచిదని ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి అచ్యుతాపురం మండలాన్ని కూడా అనకాపల్లి రెవిన్యూ డివిజన్ లోనే కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని సూచించారు. మేజర్ పంచాయతీ మునగపాకలో పిఎసిఎస్ సమీపంలో వైసీపీ ఆధ్వర్యంలో సుమారు పది రోజులు పాటు రిలే నిరాహార దీక్షలు చేసి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో తలొగ్గి అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవడం హర్షించదగ్గ విషయమని అన్నారు. మునగపాక మండలం అనకాపల్లి రెవెన్యూ డివిజన్లో కొనసాగేలా వైసీపీ ఆధ్వర్యంలో సాగిన పోరాటాలు ఫలించాయని,ఇది వైసిపి నాయకులు, కార్యకర్తలు పోరాట ఫలితమే ప్రభుత్వ నిర్ణయానికి కారణమని ప్రసాద్ అన్నారు. మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్ లోనే కొనసాగించాలని రిలే నిరాహార దీక్షలు చేపట్టిన విషయం అందరికీ తెలిసిందే. రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ప్రతి వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు,అభిమానులకు బొడ్డేడ ప్రసాద్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పనిచేసే కార్యకర్తలకు టీడీపీలోనే గుర్తింపు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కే కోటపాడు : కష్టపడి పని చేసే కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక మండల కేంద్రంలో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కే కోటపాడు, దేవరపల్లి మండలా ల బాధితులకు ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కె. కోటపాడు మండలంలో 16 మంది బాధితులకు 8,77,093 రూపాయల చెక్కులను, దేవరాపల్లి మండలానికి సంబంధించిన 7 మంది బాధితులకు 3,62,046 రూపాయల చెక్కులను అందజేసారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అన్ని వర్గాలకు సమాన గౌరవం ఇస్తుందని అన్నారు. గత జగన్ ప్రభుత్వం గ్రామాలను నాశనం చేసి పంచాయతీ వ్యవస్థను కుప్పకూల్చారని ఆరోపించారు. గ్రామాల అభివృద్ధికి వెచ్చించాల్సిన వేలాది కోట్ల రూపాయలు కేంద్ర నిధులను దారి మళ్లించి సర్పంచుల హక్కులను కాలరాసారని అన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సత్తా చూపించాలని అన్నారు. అంతకుముందు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన 35 మంది కార్యకర్తలకు ప్రశంస పత్రాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ చైర్మన్ జిల్లా పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమ అభివృద్ధి చైర్మన్ పీవీజీ కుమార్ ,మాజీ శాసనసభ్యులు గవిరెడ్డి రామానాయుడు మండల పార్టీ అధ్యక్షుడు రొంగలి మహేష్ రెండు మండలాల ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లంగాణలో గవర కులాన్ని తొలగించడం అన్యాయం

బి.ఆర్ కృష్ణయ్యకు కిషోర్ కుమార్, కాంద్రేగుల చందు విన్నతి

విశాలాంధ్ర -అనకాపల్లి: తెలంగాణలో 26 కులాల్లో మన గరవ కులాన్ని కూడా తొలగించడం అన్యాయమని వరల్డ్ వైడ్ గవర హెల్పింగ్ నీడ్స్ జేఏసీ,గౌరీ సేవాసంఘం హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ కిషోర్ కుమార్ కర్రి, నేషనల్ బీసీ వెల్ఫేర్అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాంద్రేగుల చందు నేషనల్ ఓబీసీ ప్రెసిడెంట్ ఆర్. కృష్ణయ్య కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. కులాన్ని తొలగించడం వల్ల విద్యారంగంలో ఎన్ని ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా దీనిపై బలంగా పోరాటం కూడా చేద్దాం అని చెప్పేసి ఆయన మనకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.రాను రోజుల్లో దీన్ని ముందుకు తీసుకుపోవడానికి ఆయన ప్రణాళికను కూడా సిద్ధం చేస్తానని చెప్పారు పోరాటయోధుడు మా ఆర్ కృష్ణయ్య కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేసు కుంటున్నాను తెలిపారు.

రావికమతంలో తూనికలు కొలతలు శాఖ ఆకస్మిక దాడులు...

8 దుకాణాలపై కేసులు : ఇన్స్పెక్టర్ రామారావు

విశాలాంధ్ర-రావికమతం : రావికమతం మండల కేంద్రంలో ఆది వారం తూనికలు కొలతలు శాఖ అధి కారులు వివిధ దుకాణాలపై తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా తూనికలు కొలతల్లో వ్యత్యాసాలకు పాల్పడుతున్న ఎనిమిది మంది దుకాణా దారులపై కేసులు నమోదు చేశారు. కూరగాయలు, పండ్లు, మాంసం దుకాణాలలో తూనికల్లో ఎక్కువగా మోసాలు చోటు చేసుకుంటు న్నాయన్న పలు ఫిర్యాదులపై ఆ శాఖ అనకాపల్లి జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ వి. రామారావు స్పందించారు. ఈ సందర్భంగా ఆయన రావికమతంలో మాంసం, కూరగాయలు దుకాణాలలో ఒక కిలో కు 330 గ్రాములు తక్కువ బరువుతో అమ్మ కాలు జరుపు తున్న నాలుగు దుకాణా లతో పాటు తమ శాఖ నిర్ధారించన ముద్రలు లేని తూనిక యంత్రాలు వాడు తున్న మరొక నాలుగు దుకాణాలపై కేసులు నమోదు చేశామ న్నారు. వీరి నేర తీవ్రత ఆధారంగా జరిమానాలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిం చిన దాడుల్లో ఈ ఏడాది 300 దుకాణా లపై కేసులు నమోదు చేశామని ఆయన తెలిపారు. తూనికలు కొలతలు లో తేడాలు గుర్తించిన ఎడల 1967 టోల్ ఫ్రీ నెంబర్ కు సంబంధిత షాపు వివరాలు తెలియజేయాలని చెప్పారు. పిర్యాదు దారుని వివరాలు గొప్యంగా ఉంచుతా మని ఆయన పేర్కొన్నారు.

సిఐటియు అఖిలభారత మహాసభలకు విశాఖకు కదలిరండి

విశాలాంధ్ర-మునగపాక: సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు డిసెంబర్ 31 నుంచి విశాఖపట్నంలో జరుగుతున్న సందర్భంగా మునగపాకలో అంగన్వాడీ, ఇతర కార్మికులతో విస్తృతంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.వి శ్రీనివాసరావు మాట్లాడుతూ సిఐటియు ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి చారిత్రాత్మక అఖిలభారత మహాసభల సందర్భంగా విశాఖపట్నంలో ఈనెల 31న మహాసభలు ప్రారంభం అవుతున్నాయని,జనవరి 4న కార్మిక ప్రదర్శన,అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. యావన్మంది కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో కార్మికుల సమస్యలపై అకుంఠిత దీక్షతో పోరాడుతున్న సిఐటియు మహాసభలు ఈ ప్రాంతంలో జరగటం ఈ ప్రాంత పోరాటాలకే వెన్నుదన్నుగా నిలుస్తాయని అన్నారు. అనకాపల్లి జిల్లాలో కార్మిక హక్కులకై,ఉద్యోగ భద్రతకై సిఐటియు పోరాడుతుందన్నారు. స్కీం వర్కర్ల సమస్యలపై కనీస వేతనాల అమలకై అసంఘటితరంగ కార్మికులకు సిఐటియు ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. విశాఖలో జరిగే బహిరంగ సభకు సిఐటియు అఖిలభారత నాయకులు పాల్గొన్నారన్నారు. నాలుగో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం నుండి టౌన్ కొత్త రోడ్డు వద్ద గల ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వరకు భారీ కార్మిక ప్రదర్శన అనంతరం బహిరంగ సభ జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.బ్రహ్మాజీ,జయలక్ష్మి,హేమ,సరస్వతి,లక్ష్మి,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న చోడవరం మేజర్ పంచాయతీ

ప్రధాన రహదారులను డ్రైనేజీగా మార్చిన "రత్నం రెస్టారెంట్"....

విశాలాంధ్ర-చోడవరం : చోడవరం మేజర్ పంచాయతీ కార్యాలయం వెనుక బోళ్లవీధి, బొంబాయి మేడ ఎదురురోడ్డు, బాలాజి నగర్, గాంధీ గ్రామం, తదితర ప్రాంతాలలో డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో, మురికి, చెత్తతో పంచాయితీ వీధులు కంపు కొడుతున్నాయి. ప్రధాన రహదారులను ప్రధాన డ్రైనేజీగా, పబ్లిక్ గా "రత్నం రెస్టారెంట్" వాడుకుంటోంది. పంచాయతీ ను పట్టించుకునే నాధుడే కరువవ్వడంతో, పబ్లిక్ శానిటేషన్ అస్తవ్యస్తంగా మారుతోంది. చోడవరం పంచాయతీలో గతంలో పనిచేసే శానిటరీ ఇన్స్పెక్టర్ నారాయణరావు బదిలీ కావడంతో మూడేళ్లుగా మేజర్ పంచాయతీలో శానిటరీ ఇన్స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. కాల్వల్లో మురికిని సంవత్సరం లో కనీసం రెండు సార్లు తీయడం కష్టంగా ఉంది. తొక్కుబండి రాదు, పంచాయితీ కుళాయిల్లో మురుకు నీరు, దానికి తోడు వీధిలో కుక్కల బెడద. అనేక సంవత్సరాల నుండి మేజర్ పంచాయతీలో సమస్యలు తిష్ట వేసుకున్నాయి. కేవలం తమకు ఓటు బ్యాంకు కోసమే పంచాయతీ పాలకుల నిర్లిప్తత మాత్రమే, ఇవన్నీ ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారి సమస్యలు, బాధలు ..., ప్రజా సమస్యలు పట్టించికునే వారు లేక, మురికి కూపాలతో, అపరిశుభ్ర వాతావరణంలో ...అంటువ్యాధులతో నిత్యం ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. ఇప్పిడికయినా రాబోవు పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మురికి కాల్వలను 3నెలలకు ఒక సారి అయనను తీయిస్తే, ప్రజారోగ్యం కుదుటపడగలదు. అక్కడెక్కడో ఫోటోలు తీసుకుంటూ స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర అంటూ పాలకులు అధికారులు పత్రికలకు ఫోజులిస్తున్నారే తప్ప చోడవరం మేజర్ పంచాయితీలో పారిశుధ్య సమస్యలు వారికి కానరావడం లేదని ప్రజాసంఘాలు, మహిళ సంఘాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. తక్షణమే అధికారులు పాలకులు చోడవరం మేజర్ పంచాయితీపై దృష్టి సారించి అపారిశుధ్యం నుండి ప్రజారోగ్యాన్ని రక్షించాల్సిందిగా డిమాండ్ చేస్తున్నారు.

పార్టీకై కష్టపడే ప్రతి ఒక్కరికీ పార్టీ లో సముచిత స్థానం

మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్

విశాలాంధ్ర-సబ్బవరం: వైయస్సార్సీపి కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ పార్టీ లో సముచిత స్థానం ఉంటుందని మాజీ ఎమ్మెల్యే అదీప్రాజ్ అన్నారు. మండలంలోని అద్దురూ గ్రామంలో ఆది వారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇరువాడ గ్రామ నూతన కమిటీ నిర్వహించిన అభినందన సభకు ముఖ్య అతిథిగా పెందుర్తి మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్ హాజరై కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అదీప్ రాజ్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ పార్టీ లో సముచిత స్థానం కల్పించి ఎల్లప్పుడూ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గండి రవికుమార్, సీనియర్ నాయకులు బోకం రాము నాయుడు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కోటాన రాము,మండల పార్టీ అధ్యక్షులు కర్రి బాబు, ఇరువాడ సర్పంచ్ బలిరెడ్డి కనకరాజు, ఆసకపల్లి ఎంపీటీసీ కర్రి అప్పారావు, సబ్బవరపు నారాయణమూర్తి, దేడ్డం ప్రసాద్, మామిడి బంగారనాయుడు, మండల వైసీపీ పార్టీ ఉపాధ్యక్షుడు యడ్ల నాయుడు, మచ్చ కోటి,దాడి సత్యనారాయణ,గవర రాజు,దువ్వి దుర్గాలు,అనకాపల్లి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్ కుమార్, సంద్రణ అప్పారావు,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

విశాలాంధ్ర-కశింకోట: కశింకోట. డిపిఎన్ జెడ్పీ హైస్కూల్ 1992బి93 టెన్త్ బ్యాచ్ పూర్వపు విద్యార్థులు అనకాపల్లి మండలం సత్యనారాయణపురం దేవస్థానం వద్ద ఆది వారం కలిశారు. సుమారు 33 సంవత్సరాల తర్వాత పూర్వపు విద్యార్థులంతా ఒకచోటకు చేరారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వక విద్యార్థుల్లో ఆర్థికంగా వెనకబడిన వారికి సహాయం చేయాలని తీర్మానం చేశారు. ఇందుకోసం శాశ్వత నిధి స్వీకరించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థుల కమిటీ సభ్యులు మల్ల రాంబాబు, దాడి ఉదయ్ కుమార్, మేడిశెట్టి నూకరాజు, పేలూరి గణేష్, నంబారు రమణ, భర్నికాన సింహాచలనాయుడు, కోన గంగరాజు, చెల్లి బోయిన బాలేష్, ఆళ్ల వెంకట అప్పారావు, నంబారు సత్యారావు, ఎర్రం శెట్టి శ్రీనివాసరావు, పైలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేలబావిలో పడి పశు వైద్యుడు మృతి



విశాలాంధ్ర-కే కోటపాడు: ప్రమాదవ శాత్తు నేల బావిలో పడి పశువుల డాక్టర్ మృతి చెందిన సంఘటన జరిగింది. వివరాలు ప్రకారం రావి కమతం మండలం గొంప గ్రామానికి చెందిన పీలా కొండల రావు(32) విశాఖ డైరీలో పశువుల డాక్టర్ గా పనిచేస్తున్నాడు. కే కోటపాడు లో భార్య పిల్లలతో నివాసం ఉంటూ మండలంలో డైరీ పంపిణీ చేసిన ఆవులు గేదెలకు చికిత్సలు చేస్తుంటాడు. శనివారం రాత్రి విధులు ముగించుకొని కే సంతపాలెం దగ్గర్లో బహిర్భూమికి వెళ్లి నేల బావిలో జారి పడి పోయాడు. భర్త ఇంటికి రాకపోవడంతో భార్య నిరోష కుటుంబ సభ్యులకు తెలపగా సోదరుడు అప్పలనాయుడు కే సంతపాలెం దగ్గరలో మోటార్ సైకిల్ గుర్తించాడు. పక్కనే ఉన్న నేలబావిలో పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు అప్పలనాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రమాదవశాత్తు జరిగిందే తప్ప తన సోదరుడు మృతి పై ఎటువంటి అనుమానాలు లేవని పోలీసులకు స్పష్టం చేశాడు. స్థానిక ఎస్ ఐ ధనుంజయ్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కే కోటపాడు మార్చురీకి తరలించారు . కాగా మృతునికి భార్యతో పాటు జోషిత్ నాయుడు మోక్షిత అనే ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

మద్యం దుకాణం వద్దు ... గొలుసు దుకాణమే ముద్దు...

విశాలాంధ్ర - చోడవరం :మండలంలోని గవరవరం గ్రామంలో ప్రభుత్వ మద్యం దుకాణానికి నష్టాలు వస్తున్నాయంటూ మూసేసి,.... బెల్ట్ షాపుల (గొలుసు దుకాణం) కు తెర లేపారు. మయూరి వైన్స్ జి.ఎస్.ఎల్. నెం. ఏ.కె.పి/88 లైసెన్సు హ్యాండోవర్ చేసిన తర్వాత త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామంటూ సర్కిల్ ఎక్సైజ్ స్టేషన్ అధికారులు తాత్సారం చేస్తుండడంతో మద్యం గొలుసు దుకాణాలు జోరందకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార టిడిపి, కూటమి నాయకుల అండ దండలతో గవరవరంలో మద్యం గొలుసు దుకాణం తెరిచారు. గ్రామానికి చెందిన పడాల వెంకటస్వామి అనే వ్యక్తి రూ. 3,50,000లు కి గ్రామ పెద్దల సమక్షంలో మద్యం పాట పాడుకుని బెల్ట్ షాప్ నడిపిస్తున్నాడని, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో చోడవరం సర్కిల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్కడా మద్యం గొలుసు దుకాణాలు లేవంటూ చెబుతున్న చోడవరం సర్కిల్ ఎక్సైజ్ అధికారుల మాటల్లో నిజం ఎంతో తేటతెల్లమవుతోంది. అధికారుల చేతివాటంతో..., ప్రభుత్వ ఎక్సైజ్ ఖజానాకు భారీ రంధ్రం ఏర్పడే ప్రమాదం పొంచి వుందని, ఉన్నత స్థాయి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజా సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

భక్తి శ్రద్ధలతో మేలుకొలుపులు...

దొండపూడి దేవతామూర్తుల చిత్రపటాలతో మేలుకొలుపు...

విశాలాంధ్ర -రావికమతం : ధనుర్మాసం సందర్భంగా గ్రామాల్లో మేలుకొలుపు కార్యక్రమాలు జరుగుతు న్నాయి. ఆదివారం దొండపూడి గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు. శ్రీకల్యాణ వెంకటేశ్వర మేలు కొలుపు బృంధం వేకువ జామున 4 గంటలు నుంచి భజన పాటలు, సంకీర్తనలు ఆలపిస్తూ మహిళలు, చిన్న పిల్లలు, భజన బృందాలు దేవతా మూర్తు చిత్ర పటాలతో గ్రామ పుర వీధుల్లో తిరుగుతూ మేలుకొలుపు నిర్వహించా రు. మహిళలు, స్థానికులు స్వామి వారి చిత్ర పటాలను దర్శించుకొని పూజలు చేసారు..

రాంబిల్లిలో టీడీపీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం



విశాలాంధ్ర -రాంబిల్లి : మండలం లోని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులు వసంతవాడ దిన్ బాబు ఆధ్వర్యంలో రాంబిల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాంబిల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లాలం భరత్, యువ నాయకులు గొంతిన హరీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లాలం భరత్ మాట్లాడుతూ వచ్చే పంచాయతీ ఎన్నికల్లో మనస్పర్థలు వీడి సమిష్టిగా పనిచేసి కూటమి అభ్యర్థిని గెలిపించుకోవాలని అన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకూ తప్పకుండా గుర్తింపు లభిస్తుందని తెలిపారు. మాజీ మండల అధ్యక్షులు వసంతవాడ దిన్ బాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులను, పార్టీ గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి గుర్తింపు వచ్చేలా పనిచేస్తానని అన్నారు. గొంతిన హరీష్ మాట్లాడుతూ తెలుగుదేశం కార్యకర్తల పార్టీ అని మన కుటుంబ సభ్యులందరం కలిసికట్టుగా ఉంటే ఇంకో 15 సంవత్సరాలు అధికారం మనదే అని అన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేయాలని, ఎవరికి ఎటువంటి అవసరం ఉన్నా తాను అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కలిదిండి రఘురాజు, క్లస్టర్ ఇంచార్జ్ చడిపల్లి సత్యనారాయణ, జల్లి ఆదిరెడ్డి, కుమ్మరాపల్లి చిన్న, యూనిట్ ఇంచార్జ్ అందుకూరి ప్రసాద్, గ్రామ శాఖ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన అవసరం

విశాలాంధ్ర -నబ్బవరం :విద్యార్థులు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కలిగి ఉండటం వలన తమ చుట్టు పక్కల వారిని చైతన్యవంతులు గా చేసి ప్రమాదాలను నివారించవచ్చునని స్థానిక ఫైర్ స్టేషన్ ఆఫీసర్ జీ.వి. సత్య రాజు అన్నారు. మండలంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా సమితి ప్రత్యేక శిబిరం 5వ రోజు కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విపత్కర పరిస్థితిల్లో మనల్ని కాపాడుకుంటూ సామాన్య ప్రజలను ఎలా రక్షించాలని అన్న అంశంపై సుదీర్ఘమైనటువంటి శిక్షణ, ఫైర్ ఫైటర్ కు ఉండవలసిన లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి డాక్టర్ గణేష్ లెక్కల. ఫైర్ మాన్లు పాల్గొన్నారు.

మాడుగులలో కాంగ్రెస్ పార్టీ 141 ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర- వి.మాడుగుల: మాడుగులలో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పడాల కొండలరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవంను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. పేదల కోసం పుట్టిన పార్టీ కాంగ్రెస్ అని, స్వాతంత్ర పోరాటంలో క్రియాశీలకంగా వ్యవహరించిందన్నారు. త్వరలోనే కాంగ్రెస్ కు పూర్వ వైభవం వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుపుట్టా పెదహనుమంతు, పిళ్లా అప్పారావు, గుమ్మడి ఈశ్వరరావుతో పాటు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గన్నారు.

విశాలాంధ్ర
పేజి :2
అనకాపల్లి
సోమవారం, 29 డిసెంబర్ 2025

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-యస్.రాయవరం : మండల కేంద్రం ఎస్. రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరిగింది 1986- 87 సంవత్సరం 10వ తరగతి కు చెందిన పూర్వ విద్యార్థులు ఎస్. రాయవరం సమీపంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ బ్యాచ్ చెందిన విద్యార్థులు ఫ్రెండ్స్ అండ్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఏర్పాటు చేసుకొని ప్రతి సంవత్సరము ప్రత్యేకంగా సమ్మేళనం నిర్వహించి తన తోటి స్నేహితులకు ఏ సమస్య వచ్చినా చర్చించుకుని సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. అనంతరము వారందరూ యోగక్షేమాలు అడిగి తెలుసుకుని కలిసి భోజనాలు చేసి ఆనందం వ్యక్తం చేశారు. అంతకుముందు బజార్ సెంటర్లో ఉన్న మహాకవి గురజాడ అప్పారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన వైస్. ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, భీమశెట్టి రమణ అప్పారావు ,వెలగా గోపాలకృష్ణ ,కర్రి రవికుమార్, శ్రీను మాస్టారు ,గోపిరాజు ,పోతు అర్జున్ రావు ,మడగల బుజ్జి ,కే .అమ్మాజీ ,బత్తుల కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఫొటోరైటప్: మాడుగుల-2. పూర్వ విద్యార్థుల

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర-వి.మాడుగుల : మాడుగుల మండలం తాటిపర్తి ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ ఉన్నత పాఠశాల అపూర్వ ఆత్మీయ కలయిక సమ్మేళన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాడు గుల మండలం తాటిపర్తి శివారు గరికిబంద, బిల్లలపాలెం, వెళ్లే గల టేకు తోటలో నిర్వహించిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించారు. ఈ సమ్మేళన కార్యక్రమంలో ముందుగా పూర్వపు విద్యార్థుల తీపి జ్ఞాపకాలను గుర్తు చేశారు. అనంతరం ఉపాధ్యాయులు అక్కారావు, షేక్ మీరా, బంగారు నాయుడు, ఎస్వీఎల్ఎన్ గుప్తా, రాధాకృష్ణ, ప్రభాకర్, శేఖర్, అప్పటి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ రమణ, పోస్ట్‌మేన్ కృష్ణారావు తదితరులు మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలను అందించారు. అనంతరం ఉపాధ్యాయులను సాలువా కప్పి సన్మానించిన సత్కరించి మెమోంట్‌లను అందించారు. అనంతరం వనభోజనాలు చేశారు. ఈ పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో 1993-2003 కి చెందిన 150మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మునగపాకలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 సంవత్సర పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం మునగపాక మండలం వాడ్రాపల్లి గ్రామంలో కలిసారు.ఒకరినొకరు యోగక్షేమాలు తెలుసుకుని,ప్రస్తుత వృత్తి,ఉద్యోగ పరిస్థితులపై చర్చించారు.ఈ సమ్మేళనం పూర్వ విద్యార్థుల మధ్య అనుబంధాన్ని మరింత బలపరిచింది.ఈ కార్యక్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు మళ్ల వరహ నర్సింగరావు,మళ్ల జోగారావు,టెక్కలి పరశురామ్,సూరిశెట్టి రాము,ఆడారి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ముస్తాబవుతున్న మైచర్లపాలెం రామాలయం

విశాలాంధ్ర-చోడవరం : ఈనెల 30న వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని మైచర్లపాలెం గ్రామంలో శ్రీ సీతారాముల వారి ఆలయాన్ని అంగరంగ వైభవంగా ముస్తాబు చేస్తున్నారు. ఈ ఏడాది తొలకరి పంట వరి వెన్నులతో , రంగు రంగుల పుష్పాలతో, వివిధ హంగులు తో రామాలయాన్ని కన్నుల పండువగా తీర్చిదిద్దుతున్నారు. ఈనెల 16 నుండి ప్రారంభమైన ధనుర్మాసం సందర్భంగా మేలుకొలుపులు కార్యక్రమంలో ప్రతీ రోజూ వేకువ జామున 4 నుండి 6 వరకు వీధి వీధి న హరినామ సంకీర్తనలు తో శ్రీ లక్ష్మీ నారాయణులను మేలు కొల్పుతున్నారు. గ్రామ సర్పంచ్, భజన గురువు అయిన బూరె మాణిక్యం ఆధ్వర్యంలో భక్తులు, ప్రజలు హరినామ సంకీర్తనలు చేస్తున్నారు. ఈ నెల 30న (మంగళవారం) వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని వేకువజాము నుండి ప్రత్యేక పూజలు, ఏకాహం, ఉత్తర ద్వార దర్శనంలో శ్రీ సీతారాముల దర్శనం కల్పించనున్నట్లు, 31న భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మాణిక్యం, ఆలయ అర్చకులు తెలియజేశారు.

1994-95 పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర-మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1994-95 పదవ తర గతి విద్యార్థులు మునగపాక మండలం అరబుపాలెం గ్రామంలో మునిసిలితల్లి అమ్మవారి గుడి వద్ద ఆదివారం కలిశారు.అలాగే ఎన్నో సంవత్సరాలుగా ఎక్కడో సుదూర ప్రాంతాల్లో ఉద్యోగ,వ్యాపారాల రీత్యా స్థిరపడిన వారంతా ఒకచోట చేరి ఆత్మీయ సమావేశం చేసుకున్నారు.ఎక్కడెక్కడో ఉండి ఒక చోటికి చేరి ఒకరినొకరు పలకరించుకున్నారు.చిన్ననాటి చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకున్నారు. మునగపాక 1994-95 పూర్వపు విద్యార్థుల ఆత్మీయ కలయికలో గతంలో నాగులపల్లి గ్రామానికి చెందిన జువ్వాల రామకృష్ణ,మునగపాక గ్రామానికి చెందిన ఆడారి తాతయ్యనాయుడు,తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన సొంటియాన నాగేశ్వరరావు చనిపోతే వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి 50వేల రూపాయలు చొప్పున ఫిక్స్ డిపాజిట్ బాండ్లు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.అనంతరం మునిసిలితల్లి అమ్మవారికి పెంటకోట విజయ్ శాశ్వత నిధి కింద 20వేలు రూపాయలు విరాళం అందజేశారు.ఈ కార్యక్రమంలో పెంటకోట విజయ్,సూరిశెట్టి జోగారావు,ఎల్లపు సత్యనారాయణ(హైదరాబాద్),పెంటకోట పట్టాభి,కర్రి భాస్కరరావు,మళ్ల పరదేశినాయుడు,పెంటకోట గోపీనాథ్,దొడ్డి రమణ,సూరిశెట్టి సోమేశ్వరరావు,మన్నె జయప్రకాష్,యల్లపు నాగేష్,దొడ్డి కృష్ణ,వేగి కనుమ నాయుడు,కొయిలాడ శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పంచాయతీ ఐదేళ్లైనా 'అభివృద్ధి' అడుగుపెట్టలేదా?

విశాలాంధ్ర-రోలుగుంట: రోలుగుంట మండలం లోని అర్ల పంచాయతీ పేరు పంచాయతీగానే మిగిలి పోయింది. 2020లో అధికారికంగా ఏర్పాటు చేసిన ఈ పంచాయతీకి ఐదేళ్లు గడుస్తున్నా, కనీస మౌలిక వసతులు ఇప్పటికీ కలగని దుస్థితి నెలకొంది. గిరిజనులు నివసించే గ్రామాలు పాలకుల కళ్లకు కనిపించడంలేదా? లేక అభివృద్ధి అంటే పట్టణాలకే పరిమితమా? అనే ప్రశ్నలు గ్రామస్తుల నోట వినిపిస్తున్నాయి. అర్ల, గుర్రాలబయలు, గదబపాలెం, లోసింగి, కొత్తలోసింగి, నీలబంధ, పెదగరువు, విత్రిగెడ్డ గ్రామాల్లో మొత్తం 680 మంది జనాభా ఉంది. కానీ ఇంత జనాభా ఉన్న పంచాయతీకి ఇప్పటివరకు పంచాయతీ కార్యాలయం లేదు అంటే పాలన ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. చదువు కోసం మూడు కిలోమీటర్ల నడక... ఇదేనా గిరిజన విద్యాభివృద్ధి లోసింగి, కొత్తలోసింగి, నీలబంధ, పెదగరువు, విత్రిగెడ్డ గ్రామాలకు పాఠశాలలు లేవు. ఐదేళ్లు పైబడిన పిల్లలు 30 మంది ఉన్నారు. వీరంతా రోజూ మూడు కిలోమీటర్లు నడిచి, రాళ్ల బాటలు దాటుకుని, రత్నంపేట పంచాయతీ పరిధిలోని వైబి.పట్నం గ్రామానికి వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. చిన్నారుల చదువు ఇంత కష్టంగా ఉంటే, ఆ గిరిజన ప్రాంతంలో విద్య ఎలా ఎదుగుతుంది? అర్ల, గుర్రాలబయలు గ్రామాల్లో మాత్రమే పాఠశాలలు ఉండటం వివక్షను మరింత స్పష్టంగా చూపిస్తోంది.

అంగన్వాడీ లేక చిన్నారుల భవిష్యత్తుకు గండం

ఇంకా దారుణమేమిటంటే ఐదేళ్లలోపు చిన్నారులు 25 మంది ఉన్నా, లోసింగి, కొత్తలోసింగి, నీలబంధ, పెదగరువు, విత్రిగెడ్డ గ్రామాల్లో ఒక్క అంగన్వాడీ కేంద్రం కూడా లేదు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అందాల్సిన పోషకాహారం, ఆరోగ్య పర్యవేక్షణ కేవలం మాటలకే పరిమితమైంది. అర్ల, గుర్రాలబయలు గ్రామాల్లో మాత్రమే అంగన్వాడీ కేంద్రాలు ఉండటం, మిగిలిన గ్రామాలపై చూపిస్తున్న నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది.

హామీలకు గడువు లేదా?

ఆరు నెలల క్రితం జిల్లా విద్యాశాఖ అధికారి వచ్చి పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఐసీడీఎస్ పీఓ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మాటలు గాలిలో కలిసిపోయాయా? లేక ఫైళ్లలో దుమ్ము పట్టుకుపోయాయా? అనే సందేహం గ్రామస్తులను వేధిస్తోంది.

కోట్ల రోడ్డు వర్షానికే కరిగిపోయిందా?

ఈ గ్రామాలకు రోడ్డు సదుపాయం ఎప్పటినుంచో శాపంగా మారింది. గతంలో రాళ్లపై నడుచుకుంటూ వెళ్లే పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తారు రోడ్డు కోసం నిధులు మంజూరు కావడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.అర్ల నుంచి విత్రిగెడ్డ వరకు, వైబి.పట్నం నుంచి లోసింగి వరకు సుమారు రూ.6.60 కోట్లతో బీటీ రోడ్డు మంజూరైనప్పటికీ, వాస్తవంగా వేసింది మాత్రం మెటల్ రోడ్డు. ఈ ఏడాది వర్షాలకు ఆ రోడ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. కోట్ల నిధులు ఎటు పోయాయి? పనుల నాణ్యతను ఎవరు పరిశీలించారు? అనే ప్రశ్నలు మిగిలాయి. ఇళ్లు మంజూరయ్యాయి.రోడ్డు లేక సామగ్రి రావడం లేదులోసింగి గ్రామంలో ఇళ్లు మంజూరైనా, నిర్మాణ సామగ్రిని గ్రామానికి తెచ్చుకునే దారి లేకపోవడంతో పనులు ఆగిపోయాయి. ఇల్లు ఉన్నా రోడ్డు లేక ప్రయోజనం ఏమిటని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా స్పందించాలి... లేదంటే?

మంజూరైన నిధులతో నాణ్యమైన బీటీ రోడ్డు నిర్మించి రహదారి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, అర్ల పంచాయతీ కార్యాలయాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.గిరిజన గ్రామాల అభివృద్ధి కాగితాలకే పరిమితమైతే, అర్ల పంచాయతీ ఎప్పటికి వెలుగులోకి వస్తుంది? ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరవాలని ప్రజలు కోరుతున్నారు.

టి. సిరసపల్లిలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-మునగపాక: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు,అల్ల గణేష్ అన్నారు.మండలంలో టి.సిరసపల్లి గ్రామంలో మైరా డయాబెటిస్ ఫౌండేషన్,అమెరికన్ క్లినిక్ అనకాపల్లి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరం యొక్క ముఖ్య ఉద్దేశ్యం సమాజంలో డయాబెటిస్ మరియు ఇతర సాధారణ ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచడం,తొందరగా వ్యాధులను గుర్తించి సరైన చికిత్సకు దారి చూపడం,ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడడం మైరా డయాబెటిస్ ఫౌండేషన్ యొక్క ప్రధాన లక్ష్యమని అన్నారు.గ్రామంలో అవసరమైన వారందరికీ షుగర్,బీపీ, ఇతర వ్యాధులకు సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ సునీల్ కుమార్ ను ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు,అల్ల గణేష్ ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మైరా డయాబెటిస్ ఫౌండేషన్ మరియు అమెరికన్ క్లినిక్ డాక్టర్ జి.సునీల్ కుమార్ పాల్గొన్నారు.